క్లుప్తంగా

184 మందికి వైద్య పరీక్షలు



ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. 184 మందికి వైద్యురాలు శాంతి షుగర్, బీపీ, యూరిన్ పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలకు కూడా రక్త, యూరిన్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఎనీమియా రాకుండా గర్భిణులు తగిన పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకోవాలి

ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు



ఫిరంగిపురం: గ్రామాల్లో అపరిశుభ్రత లేకుండా తగిన చర్యలు పంచాయతీ కార్యదర్శులు తీసుకోవాలని ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేరు చేసి పారిశుద్ధ్య బండిలో వేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. గ్రామాల్లో వీధులు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. తాగునీటిని సరఫరా చేసే ట్యాంకులు శుభ్రంగా కడిగేలా చూడాలన్నారు. వచ్చేది వేసవి కాలం కావడంతో తాగునీటి సరఫరా విషయంలో తగిన శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ అవసరం



ఫిరంగిపురం: ప్రతి విద్యార్థికి క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని ఎంఈవోలు షేక్ మహబూబ్‌సుభాని, రవికాంత్‌లు అన్నారు. మండలంలోని వేములూరిపాడు ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు స్కౌట్ యూనిఫామ్‌ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పీఎం శ్రీ ఫేస్-1 కింద ఎంపీయూపీ పాఠశాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. దానిలో భాగంగా 30 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి నూతన స్కౌట్ దుస్తులు, షూస్, బెల్ట్, టై, టోపి, బ్యాడ్జిలు అందజేశామన్నారు. పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణకు ఎంపికయినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వై.వీ.ప్రమీల, మేరిమాత, శాంతకుమారిలు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ చేయించడం నేరం



తెనాలి: వెట్టి చాకిరీ నిర్మూలన దినం సందర్భంగా శుక్రవారం తెనాలి కిరాణా మర్చంట్ అసోసియేషన్ హాలులో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. తెనాలి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షుడు డి.శ్రీనివాసులు ఆదేశాలతో ఈ సదస్సును ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.వివేక్‌వర్ధన్ హాజరయ్యారు. వెట్టి చాకిరీ చేయించుకోవడం నేరమని చెప్పారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించటం కోసం కోసం ఈ న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎవరైనా వెట్టి చాకిరీ చేయించుకుంటున్నట్టు తెలిస్తే కార్మికశాఖకు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌కు తెలియపరచాలని సూచించారు. నిజమని నిరూపణ జరిగినట్టయితే వెట్టి చాకిరీ చేయించుకున్నవారికి మూడేళ్ల జైలుశిక్ష, రూ. 2వేల వరకు జరిమానా విధిస్తారని చెప్పారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ డి.వెంకటశివప్రసాద్ వెట్టి చాకిరీ చట్టాలను వివరించారు. మండల విద్యాశాఖ అధికారి వి.జయంతి బాబు, తెనాలి బార్ అసోసియేషన్ కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, ప్యానల్ న్యాయవాది షేక్ ఖాదర్ హుస్సేన్, కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కిషోర్, ఉదయ శంకర్ మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ పర్యవేక్షకుడు షేక్ మహబూబ్, వన్ టౌన్ ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల అడ్డా.. పంచాయతీ కార్యాలయం

- పగలు చిత్తు బొమ్మ- పేకాట, రాత్రి పీకల దాకా మద్యం
- పలుమార్లు హెచ్చరించినా తీరు మార్చుకోని ఆకతాయిలు



తాగునీటి సంప్ కోసం నిర్మించిన బెడ్‌పై మద్యం సీసాలు, వాటర్ బాటిళ్లు

తాడికొండ: తాడికొండ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణ ఆకతాయిలకు అడ్డాగా మారింది. పగలు రాత్రి తేడా లేకుండా నిత్యం ఆకతాయిలు పంచాయతీ కార్యాలయం వెనుక పక్క ఉన్న ఖాళీ స్థలంలో మద్యం తాగడంతో పాటు చిత్తు బొమ్మ- పేకాట ఆడుతూ ఆవరణను అధ్వాన్నంగా మారుస్తున్నారు. దీనిపై గతంలో పలుమార్లు హెచ్చరించినా తీరు మార్చుకోకపోవడంతో ప్రస్తుతం ఆ ప్రాంతం అధ్వాన్నంగా మారింది. ఎటు చూసినా బీరు సీసాలు, మందు బాటిళ్లు, వాటర్ బాటిళ్లతో నిండిపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడ పలుమార్లు పేకాట నిర్వహణ జరుగుతున్న సమయంలో పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. అయితే ఇటీవల కాలంలో గస్తీ పూర్తిగా కొరవడటంతో పంచాయతీ కార్యాలయం ఆకతాయిలకు అడ్డాగా మారుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. యువత పెద్ద ఎత్తున చేరి అడ్డాగా మార్చుకొని మద్యం తాగడం వివాదాలకు దిగుతుండటం కారణంగా పరిస్థితి ఇబ్బందికరంగా మారుతుంది. సంబంధిత పోలీసు, పంచాయతీ అధికారులు ఇకనైనా స్పందించి ఆకతాయిల బెడద నుంచి పంచాయతీ కార్యాలయాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి హరిబాబును వివరణ కోరగా ఆకతాయిల ఆగడాలపై తాను గతంలో పలుమార్లు హెచ్చరించడం జరిగిందని, వారు పెడచెవిన పెడుతున్న కారణంగా ఆవరణ అధ్వాన్నంగా మారుతున్న మాట వాస్తవమే అన్నారు. పాలకవర్గం దృష్టిలో పెట్టి చెట్లు తొలగించి ఫెన్సింగ్ వేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు.



పంచాయతీ కార్యాలయం వెనుక ఆకతాయిలు తాగి పడేసిన బీరు సీసాలు

వైభవంగా జీవధ్వజ, విగ్రహాల ప్రతిష్ట



జీవధ్వజానికి పూజలు చేస్తున్న భక్తులు



నవగ్రహ విగ్రహాల వద్ద పూజల్లో భక్తులు

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని కాశీవిశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో నూతన జీవధ్వజ స్తంభ, నవగ్రహ విగ్రహాలు, సరస్వతి, జంటనాగేంద్ర, హరిహరమూర్తి, చండీశ్వరుడు, అర్ధనారీశ్వరుడు విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఉదయాన్నే వేదపండితులు కాకుమాను ఆంజనేయశాస్త్రి, రావూరి పూర్ణచంద్రశాస్త్రి, ఇంకొల్లు సుధీర్ శాస్త్రి, పురుషోత్తమశాస్త్రిలు విశేష పూజలు, గర్భపూజ, రత్నన్యాసం, ధాతున్యాసం పూజలు చేసి జీవధ్వజ ప్రతిష్ట గావించారు. మిగిలిన దేవతా విగ్రహాల ప్రతిష్ట చేశారు. అనంతరం విప్రధేను పూజ, దర్పణ, కన్యత్యజాగ్ని, కూష్మాండచేధన, మహోదన, దశవిధ, మహాపూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. దేవతా మూర్తులకు విశేష పూజలు, అలంకారాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాలను దేవస్థాన నిర్వహణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి అండగా ఉంటాం

ఎస్పీ సతీష్ కుమార్



కానిస్టేబుల్ వలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

మంగళగిరి: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. ఎస్పీ శుక్రవారం నవులూరులోని రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ వలి నివాసానికి చేరుకుని వలి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఇమ్రాన్‌కు పోలీస్ శాఖ తరపున రూ.1 లక్ష చెక్కును అందజేసి శాఖా పరంగా అందవలసిన ప్రయోజనాలను సకాలంలో అందించడానికి కృషి చేస్తామన్నారు. వలి మృతదేహానికి నివాళులర్పించిన వారిలో ప్రొబేషనరీ ఐపీఎస్ దీక్ష, మంగళగిరి, తాడికొండ సీఐలు శ్రీనివాసరావు, వాసు, ఎంటి ఆర్ఐ శ్రీహరిరెడ్డి, ఎస్ఐ సీహెచ్ వెంకట్, పోలీస్ అసోషియేషన్ అధ్యక్షుడు మైలా సాంబశివరావు, సెక్రటరీ లక్ష్మయ్య, పలువురు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కేఎల్‌యూ విద్యార్థి బృందానికి హ్యుందాయ్ టెక్నోవేషన్ బహుమతి



విద్యార్థిని అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ డాక్టర్ రాజశేఖరరావు, ట్రిపుల్ ఈ విభాగాధిపతి

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ట్రిపుల్ ఈ చివరి ఏడాది చదువుతున్న విద్యార్థుల బృందం హ్యుందాయ్ టెక్నోవేషన్ 2024 ఆల్ ఇండియా టెక్నికల్ వర్చువల్ సింపోజియంలో మొదటి బహుమతి సాధించినట్లు వర్సిటీ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ కె.రాజశేఖరరావు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అగ్రశ్రేణి ఇంజనీరింగ్ విద్యా సంస్థలకు పోటీగా ఈ బృందం తమ వినూత్న ప్రాజెక్టుకు ఈవీలలో రాబోయే తరానికి చెందిన మానిటరింగ్ కోసం స్మార్ట్ ఇంటర్‌ఫేస్‌తో పరిశ్రమ నిపుణులను ఆకట్టుకుందన్నారు. హ్యుందాయ్ నిర్వహించిన టెక్నోవేషన్ వర్చువల్ సింపోజియంలో పలు రకాల టెక్నికల్ రౌండ్‌లను నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. తుది మూల్యాంకనంలో భాగంగా ప్రాజెక్ట్ పరిశ్రమ ఔచిత్యం, వాస్తవ ప్రపంచం అమలు కోసం సంభావ్యత, అంచనా అధ్యాపకుల మెంటర్ డాక్టర్ కళ్యాణ్ దూసర్లపూడి మార్గదర్శంలో మిస్టర్ కె.మురళీ మనోజ్ మరియు మిస్టర్ ఓ గౌతమ్‌ల బృందం ఈ-బైక్ మెయిన్ యూజర్ ఇంటర్‌ఫేస్ డిస్ప్లేను అభివృద్ధి చేసిందన్నారు. కేఎల్‌యూ ట్రిపుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ పాండియన్ మాట్లాడుతూ తమ విద్యార్థులు రూపొందించిన వాహనం గుంతలను ముందుగానే గుర్తించడంతో పాటు రోడ్డు ప్రమాదాలపై వాహన చోదకులను హెచ్చరిస్తుందన్నారు. విద్యార్థులను పరిశ్రమ ఆధారిత పరిష్కారాల వైపు నడిపించడంలో కీలక పాత్ర పోషించిన స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, కేఎల్‌యూ ట్రిపుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ పాండియన్ నిరంతర సాంకేతిక మద్దతు, ప్రోత్సాహం ద్వారా ఈ అత్యుత్తమ పనితీరు సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ కె.రాజశేఖరరావు, ప్రో వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, ఆచార్యులు డాక్టర్ కళ్యాణ్ దూసర్లపూడి తదితరులు విద్యార్థులను అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: పట్టణంలోని పలు ఏరియాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాప్టిస్ట్‌పేట, కొప్పురావుకాలనీ, పాతమంగళగిరి, తెనాలి రోడ్డు, షరాఫ్ బజార్, మిద్దె సెంటర్, ఇస్లాంపేట, భార్గవపేట, నాంచారమ్మ చెరువు, కుమ్మరి వారి బజార్, గండాలయ పేట, రాజీవ్ సెంటర్, చిన్నపంజావీధి, మైలానగర్, హుస్సేన్ కట్ట, పార్కురోడ్డు, నిడమర్రు రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, టిప్పర్ల బజార్, బ్యాంక్ కాలనీ, మార్కేండేయ కాలనీ, కుబేర రైస్ మిల్, రాయల్ కన్వెన్షన్, ఆల్ఫా హోటల్ ఏరియాలలో విద్యుత్ సరఫరా అంతరాయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

11 నుంచి హ్యాపీనెస్ ప్రోగ్రాం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి ఏఎస్ఆర్ న్యాచరల్ ఫామ్స్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11 నుంచి న్యూట్రిషన్ ఎయిర్ బ్రీత్ హ్యాపీనెస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మేకా శ్రీధర్ రెడ్డి, ఇట్టా భాస్కర్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీ నుంచి ఆరు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం మొదటి బ్యాచ్ ఉదయం 6 గంటలకు, రెండవ బ్యాచ్ సాయంత్రం 6.30 గంటల నుంచి జరుగుతుందని, ఆందోళన సమస్యలు, ఉద్రిక్తతలు, ఒత్తిడి, భయం, హ్యాపీనెస్ రిలాక్సేషన్, శాంతి, విశ్వాసం, మనసులో స్పష్టత, ఫోకస్ బెటర్ హెల్త్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మరిన్ని వివరాలకు 9949396490 నెంబరును సంప్రదించవచ్చని ఆ ప్రకటనలో కోరారు.

అక్రమ భవన నిర్మాణాలపై దాడులు

తెనాలిఅర్బన్: గంగానమ్మపేటలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులూ లేకుండా అక్రమంగా నిర్మించిన రెండు భవనాల శ్లాబ్‌లకు మున్సిపల్ అధికారులు రంధ్రాలు వేయించారు. ఈ ఘటన శుక్రవారం తెనాలిలో జరిగింది. అధికారుల కథనం ప్రకారం.. గంగానమ్మపేటలో ఇద్దరు ఇంటి యజమానులు ప్రభుత్వం అనుమతి లేకుండా నాలుగో అంతస్తును నిర్మించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శివన్నారాయణ టౌన్ ప్లానింగ్ సిబ్బందిని అక్కడకు పంపారు. వాటిని పగలకొట్టాలని ఆదేశించడంతో శ్లాబ్‌లకు రంధ్రాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎటువంటి కట్టడాలను నిర్మించరాదని తెలిపారు. అలా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీవో సాంబశివరావు, పలువురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవుడా.. క్షేమంగా గమ్యస్థానానికి చేరుకోవాలి





బడికెళ్లే విద్యార్థులు, పొలానికి వెళ్లే కూలీలు, వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఆటోల్లో ప్రమాద భరితంగా ప్రయాణిస్తున్నారు. ఆటోవాలాలు కూడా పరిమితికి మించి ఆటోలో ఎక్కించటం వలన ప్రయాణించే వారు లోపల కూర్చోవటానికి స్థలం లేక ఆటో బయట నిలబడి గాలిలో ప్రయాణిస్తున్నారు. ఒక్కోసారి పట్టుకోవటానికే పట్టు దొరక్క ఇనుప చువ్వలను ఆసరాగా చేసుకొంటున్నారు. దీని వలన పట్టు జారితే ప్రమాదం జరిగి ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశముందని వారు గుర్తించటం లేదు. కాస్త దూరమే కదా దిగితే మన పనై పోతుందిలే అని అనుకుంటున్నారు. దీనికి ఆటోవాలాలు కూడా వంత పాడుతున్నారు. రవాణా, పోలీస్ శాఖల అధికారులు పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించవద్దని ఎన్నిసార్లు మొత్తుకున్నా వారు మత్తు వీడటం లేదు. మండలంలోని ప్రధాన రహదారులు, అంతర్గత రహదారుల పరిస్థితి చూస్తే మరింత అధ్వానంగా ఉన్నాయి. ఇలాంటి సమయాల్లో ప్రయాణికులు, విద్యార్థుల తల్లిదండ్రులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే తరువాత జరగరాని ప్రమాదం ఏదైనా జరిగితే ప్రయోజనం ఉండదు. గమ్యస్థానానికి చేరుకోవటానికి కాస్త ముందుగా సమయాన్ని కేటాయించి ఇబ్బందులు లేకుండా ప్రయాణిస్తే ప్రయాణం సుఖవంతమవుతుంది.

-మేడికొండూరు

నులి పురుగుల నివారణపై సమావేశం



మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డాక్టర్ యానీగ్రేస్

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఎంఈవో కార్యాలయంలో నులి పురుగుల నివారణపై శుక్రవారం సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎంఈవో ఎ.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రేవేంద్రపాడు, ఈమని ప్రభుత్వ వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పిల్లల భవిష్యత్ కోసం అల్బెండజోల్ మాత్రలను అందజేస్తున్నామని, ఈ నెల 10వ తేదీ నుంచి మండల పరిధిలోని 1-19 సంవత్సరాల వయసు వారందరికీ అంగన్‌వాడీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కాలేజీల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు అందజేయనున్నామని తెలిపారు. పిల్లల్లో రక్తహీనతను నివారించడానికి, వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మాత్రలు మింగాలని సూచించారు. ఈ సమావేశంలో దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎం.డి. ఇజాజ్ అబ్దుల్ రహమాన్, ఈమని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రహీమున్నీసా, మండల విద్యాధికారి కె.లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

ఫిరంగిపురం: నులిపురుగుల నివారణతోనే చిన్నారులకు ఆరోగ్యం చేకూరుతుందని వైద్యురాలు యానీగ్రేస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జాతీయ నులి పురుగుల నివారణ సందర్భంగా పలు పాఠశాలల హెచ్‌ఎంలు, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 10న ప్రతి పాఠశాలలో 1-19 ఏళ్లలోపు పిల్లలందరికి నులిపురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థికి ఆల్‌బెండజోల్ మాత్రలు అందేలా చూడాలని చెప్పారు. సమావేశంలో ఎంఈవో షేక్ మహబూబ్ సుబాని, డాక్టర్ శ్వేత, ఆరోగ్య సిబ్బంది, పలు పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలి



మాట్లాడుతున్న షేక్ సుభాని

తాడేపల్లిరూరల్ : వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని కోరారు. శుక్రవారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ ఒక అమెండ్‌మెంట్ యాక్ట్ బిల్లు రూపంలో తీసుకువస్తోందన్నారు. వక్ఫ్ ఆస్తులు ప్రభుత్వ ఆస్తులు కావన్నారు. అవి ప్రైవేటు ఆస్తులు, ముస్లింలు తమ ఆస్తులలో కొంత భాగం అల్లాహ్ పేరు మీద వక్ఫ్ చేస్తారన్నారు. కేంద్రం ప్రవేశపెట్టబోతున్న వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలని కోరుతున్నామన్నారు. సీఎం చంద్రబాబు వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. వక్ఫ్ సర్వే కమిషనరేట్ తీసేయాలని కొత్త వక్ఫ్ బిల్లులో పొందుపర్చారని, అది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించేలా చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ జానీ సాహెబ్, పఠాన్ మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా మేడికొండూరు తహసీల్దార్ కార్యాలయం



తహసీల్దార్ కార్యాలయం పైభాగంలో పెచ్చులూడిన దృశ్యం

మేడికొండూరు: మండల కేంద్రమైన మేడికొండూరు తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంటుంది. తహసీల్దార్ కార్యాలయం వెలుపల పైభాగంలో స్లాబుకు నెర్రలు వచ్చి కిందకు ఇటుక సున్నం రాలిపోతుంది. దీని వలన కార్యాలయ సిబ్బందితో పాటు కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏభాగం ఎప్పుడు కిందకు ఊడిపడుతుందోనని భయాందోళనలకు గురవుతున్నారు. దీనికి తోడు కార్యాలయంలో సిబ్బంది పనిచేయాలంటే అవస్థలు పడుతున్నామంటున్నారు. పరిస్థితి వర్షాంలో తడసి ఇంకా నెర్రలు ఏర్పడటంతో పాటు కార్యాలయంలోకి వర్షపు నీరు వస్తుందని చెబుతున్నారు. ఇప్పటికైనా భవనానికి మరమ్మతులు నిర్వహించాలని వారు కోరుతున్నారు.

సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

మంగళగిరి: ప్రకృతిలో లభించే జీవ ఎరువులు, సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడం ద్వారా ఖర్చులు తగ్గడంతో పాటు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను దిగుబడి చేసుకోవడంలోమార్కెట్‌లో మంచి గిట్టుబాటు ధర లభిస్తుందని కేఎల్ వ్యవసాయ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రత్నప్రసాద్ తెలిపారు. కేఎల్ యూనివర్సిటీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని నూతక్కి గ్రామంలో రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సేంద్రియ వ్యవసాయం ఎలా చేయాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. మందులు, కృత్రిమ రసాయనాల వలన పంట ఉత్పత్తుల నాణ్యత దెబ్బతింటుందని తద్వారా ధర గణనీయంగా తగ్గుతుందన్నారు. తెగుళ్ల నిరోధక విత్తనాలు, జీపీఎస్, డ్రోన్స్, సెన్సార్ల సహాయంతో గ్రీన్, పాలీ హౌస్ ద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతులను వినియోగించం వలన డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు.

ఫ్రైడేను డ్రైడేగా పాటించండి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ పద్మవాణి

తెనాలిఅర్బన్: ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని సబ్‌యూనిట్ మలేరియా అధికారి అందె బాలచంద్రమౌళి చెప్పారు. మలేరియా విభాగం, శానిటరీ సెక్రటరీల సంయుక్త ఆధ్వర్యంలో దేవీచౌక్‌లోని శ్రీ చైతన్య స్కూల్‌లో శుక్రవారం దోమల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలు ఉన్నచోట దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. నీటిలో దోమలు గుడ్లు పెట్టి సంతతిని పెంచుకుంటాయని తెలిపారు. ఇవి కుట్టడం వలన మలేరియా, చికున్‌గున్యా, బోదకాలు, మెదడువాపు జికా వైరస్ వంటివి వచ్చే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ అవుతు పద్మవాణి మాట్లాడుతూ ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని తెలిపారు. శుక్రవారం రోజు ఇంటి ఆవరణలోని పాత వస్తువులను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు కె.సంధ్య, బి.సాగర్, జి.చంద్రశేఖర్, మలేరియా సూపర్‌వైజర్లు బండారు నాగమల్లేశ్వర్, దీపాల శ్రీనివాసరావు, దాసరి మల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్‌లు షేక్ రషీద్, నవీద్, శ్రీనివాసరావు, కరిముల్లా, శరత్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

- ముగిసిన ప్రత్యేక సదరమ్ క్యాంపు

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరమ్ క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు క్యాంప్‌లో ఈఎన్‌టీ, అప్తామాలజీ, సైక్రియాటిక్ విభాగ వికలాంగులకు పరీక్షలు చేశారు.వైద్యులు సేవలు అందించారు. సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పర్యవేక్షించారు.